# విద్యా సంస్థల్లో బతుకమ్మ సంబురాలు



అశ్వారావుపేట రూరల్: బతుకమ్మలతో విద్యార్థులు



దమ్మపేటలో..



అశ్వారావుపేట టౌన్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 12: మండలంలోని పండువారిగూడెం పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. శుక్రవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు పాఠశాల్లోనే బతుకమ్మలను తయారు చేసి ఆట పాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయుని సుజాత, మహిళలు సహకరించి విద్యార్థులను ఉత్సహపరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారామ్, సుజాత, పెసా కార్యదర్శి కొర్రి మల్లయ్య, మొడియం దుర్గారావు, సీత, పార్వతి, ధర్మరావు, బేబి పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 12: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చి ఆటలు, పాటలతో సందడి చేశారు. బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు.

**అశ్వారావుపేట టౌన్..**

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 12: పాఠశాలలకు దసరా పండుగ సెలవులు ఇవ్వటంతో గురువారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. శుక్రవారం నుంచి 13 రోజులు పాటు సెలవులు ఇచ్చారు. ఉపాధ్యాయులు బతుకమ్మలను ఏర్పాటు చేసి విద్యార్థులచే ఆడిపాడించారు. జిల్లాపరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో వేడుకలు జరిగాయి.

**దమ్మపేటలో..**

దమ్మపేట, అక్టోబర్ 12: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. గురువారం విద్యార్థులను బతుకమ్మలను తయారు చేశారు. ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.





అన్నపురెడ్డిపల్లి: బతుకమ్మలతో చిన్నారులు, అశ్వారావుపేట రూరల్: బతుకమ్మలు తీసుకొస్తున్న చిన్నారులు

## మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

అశ్వారావుపేట, అక్టోబర్ 12: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివిన ఇద్దరు విద్యార్థులు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో ఎంపీపీసీ సెకండియర్ చదివిన టీ చైతన్య, హెచ్ఈసీ సెకండియర్ చదివిన కే నాగలక్ష్మి ఎంపికయ్యారని తెలిపారు. వీరు డిగ్రీ చదువుతుండగా ఇంటర్ సెకండియర్ నుంచి ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఇంటర్‌లో రూ.10 వేలు, డిగ్రీలో ప్రతి ఏడాదికి రూ. 20 వేలు, పీజీ ఏడాదికి రూ. 30 వేలు ప్రభుత్వం విద్యార్థుల చదువు నిమిత్తం చెల్లిస్తుందన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని తోటి విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. విద్యార్థులను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## కొబ్బరి రైతులకు డ్రిప్ రాయితీపై ఇవ్వాలి

దమ్మపేట రూరల్, అక్టోబర్ 12: కొబ్బరి రైతులకు డ్రిప్ రాయితీపై ఇవ్వాలని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు ఆధ్వర్యంలో కొబ్బరి రైతు ఉత్పత్తి దారుల సంఘం నాయకులు గురువారం కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి వినతి పత్రం అందచేశారు. అంతర పంటలకు ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని, దమ్మపేట, అశ్వారావుపేట కేంద్రంగా కొబ్బరి బోర్డు ప్రాంతీయ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయతీలను రైతులకు వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ ఉద్యానవన శాఖ అధికారులతో చర్చిస్తానని చెప్పారని జోగేశ్వరరావు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొబ్బరి రైతుల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆలపాటి రాము, కొక్కెరపాటి పుల్లయ్య, ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ పామాయిల్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరు మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అదేవిధంగా రైతులు పామాయిల్ పండ్ల గెలలను అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు తీసుకెళ్లినప్పుడు ఒక్కో ట్రాక్టర్ నుంచి 50 నుంచి 70 కేజీలు తరుగు తీస్తున్నారని, నర్సరీలోని మొక్కలు నాణ్యతగా లేవని ఫిర్యాదు చేసారు. స్పందించిన కలక్టర్ ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని చెప్పారని తుంబూరు మహేశ్వర రెడ్డి తెలిపారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆలపాటి రాము

## వాహన తనిఖీల్లో 2.19 లక్షల నగదు పట్టివేత

అశ్వారావుపేట, అక్టోబర్ 12: అశ్వారావుపేట శివారు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ. 2,19,600 నగదును పట్టుకుని సీజ్ చేశారు. విశాఖపట్టణానికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు సీఐ తెలిపారు. ఆధారాలు లేకుండా నగదును తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు కిట్లు

చంద్రుగొండ, అక్టోబర్ 12: ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు వెంకటప్రకాశ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బోధకాలు వ్యాధిగ్రస్తుల (ఫైలేరియా)కు వచ్చిన 8 కిట్లను ఆయన గురువారం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ కుమారస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ ఇమామ్, ఫార్మసిస్టు లక్ష్మి, స్టాఫ్‌నర్స్ అనిత, హెల్త్‌అసిస్టెంట్ శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఫైలేరియా కిట్లు అందజేస్తున్న వైద్యులు వెంకటప్రకాశ్

## దేవీనవరాత్రులకు సిద్ధమైన ఆలయాలు



ఉత్సవాలకు సిద్ధమైన వాసవీ కన్యాక పరమేశ్వరి ఆలయం

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 12: దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం పట్టణంలోని నాయిబ్రాహ్మణ బజార్‌లో ఉత్సవ వేడుకలను నిర్వహించేందుకు చలువ పందిరి వేసే పనిలో యువకులు, మహిళలు నిమగ్నమయ్యారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, పలు వీధుల్లో ఇప్పటికే చలువ పందిళ్లు వేసి, విద్యుద్ధీపాలను అలంకరించారు. భక్తులు అమ్మవారికి తొమ్మిదిరోజులు పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

## బీఆర్ఎస్‌లో చేరనున్న జడ్పీటీసీ వెంకటరెడ్డి



ప్రభుత్వ విప్ రేగా కాంతారావుతో జడ్పీటీసీ వెంకటరెడ్డి

చంద్రుగొండ, అక్టోబర్ 12: చంద్రుగొండ జడ్పీటీసీ కొణకండ్ల వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లో 30 సంవత్సరాలుగా ఉంటూ, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి జడ్పీటీసీగా ఎన్నికైనాడు. ఇటీవల కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలతో మనస్థాపానికి గుర్తైన్నట్లు సమాచారం. దీంతో బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, ఎంపీ నామా నాగేశ్వరరావుతో ప్రత్యేకంగా సమావేశం జరిపి, పార్టీ మార్పునకు ఒప్పుకున్నారు. పార్టీలో సముచిత స్థానం ఇచ్చేలా చూడడం తమ బాధ్యతని వారు హామీ ఇచ్చారు. వీరి హామీ మేరకు ప్రభుత్వ విప్ రేగ కాంతరావుతో మాట్లాడినట్లు వెంకటరెడ్డి తెలిపారు. జడ్పీటీసీ పార్టీ మారుతుండడంతో మండల రాజకీయాల్లో మార్పులు జరుగుతున్నాయి. వెంకటరెడ్డికి మద్దతుగా గ్రామాల్లో రెండుగా చీలి, పార్టీ మారేందుకు సమాయత్తం అవుతున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 12: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన ఎంపీడీవో అన్నపూర్ణతో కలిసి సందర్శించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఎన్నికల నిర్వహణకు 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై షాహీనా, ఎంపీవో షబ్నా, ఆర్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి వెంకటేశ్, సిబ్బంది

చంద్రుగొండ, అక్టోబర్ 12: త్వరలో జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అశ్వారావుపేట ఎన్నికల పోలీస్ నోడల్ అధికారి వెంకటేశ్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. యువతీ, యువకులు ఓటు హక్కును స్వేచ్ఛగా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చూడడం పోలీస్ శాఖ బాధ్యత అన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మాచినేని రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 12: జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. గురువారం మండలంలోని శాంతినగర్ గ్రామ శివారులోని గొత్తి కోయల గ్రామంలో ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక జ్వర పీడీతులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.